


**ఉపోద్ఘాతం :**

ఊరుకో ఇంజినీరింగ్ కాలేజీ ఉద్భవిస్తోంది. కొన్ని ఊళ్లలో ఒకటి పెడ్తే సంతృప్తి పడి ఊరుకోక రెండు మూడు పెట్టించుకొంటున్నారు. ఆ మధ్య తీసిన లెక్కల ప్రకారం ఏడాదికి 16,500 మంది బి. య్యీలు, 2700 మంది ఎమ్. ఇలు, 150 మంది డాక్టరేట్లు మనదేశంలో తయారవుతున్నారు. 140 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి బయట పడుతున్నారు. గత రెండు సంవత్సరాలలో తెలుగు నాట కొత్త కాలేజీలు పది వెలిసాయి. కర్నాట మరికొన్ని వెలిసాయి. దేశంలో ఉన్న "ఇంజినీరింగ్ మేష్టర్లు" కొందరు కొత్త కాలేజీల్లో సర్దుకొన్నారు కొత్త కాలేజీల్లో ఖాళీలు నిండలేదు గాని పాత కాలేజీల్లో ఖాళీ లేర్పడ్డాయి. కాలేజీలు పుట్టుకు వచ్చినంత వేగంగా దేశంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పెరగలేదు. ప్రయోగశాలలకి కావలసిన పరికరాలు పనిముట్లు తయారుచేసే కంపెనీలు కొద్దే ఉండి "టెక్" చూపిస్తున్నాయి. ఒకటి క్షుద్ర సంతానంలాగా బిల బిలా పుట్టుకు వస్తుంటే రెండవ వర్గం వినుత సంతానం లాగా తాపీగా వాటి పైమువి తీసుకొంటున్నాయి.

ఈ విషయం నా దృష్టికి తెచ్చిన ఆంధ్రాయూనివర్సిటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్లకి జమిలి గాను, సహోధ్యాయుడు వారణాసి సీతారావ్‌కి ప్రత్యేకంగాను నా కృతజ్ఞత. శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలుంటాయిట. ఈ సంచార పరిశోధనాలయం సీతారావ్ సూచించిన అటువంటి ఉపాయం !

**కథ :**

సిద్దయ్య వచ్చి అరుబయట అల్లుడి కెదురుగా పడక్కుర్చీలో కూర్చుని చుట్ట తీసి వాసన చూసి ముట్టించాడు.

"ఏటా అల్లుడూ మనూరేమన్నా మారిందా ?" అని అడిగాడు.

"నా పెళ్లి కెల్లా ఉందో ఇంకా అల్లాగే ఉంది. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టు" అన్నాడు సదరు అల్లుడు గోవన్న.

గోవన్న అసలు పేరు గోపాలరావ్. ఆఫీసులో అందరు డాక్టర్ గోపాల్ అంటారు. భార్యమణి మాత్రం, అందర్లోను "గోపీ డియర్," "డార్లింగ్ గోపీ"అనీ, ఏకాంతంలో "నా పిచ్చి గోపీ" అని పిలుస్తుంది. ఆ పిల్ల అతగాడితో అమెరికా వెళ్లి వచ్చినప్పటి నుంచి రంగూ వాసనా రుచి లేని "ఏమండి" అన్న పిలుపు పిలవటం మానేసింది. ఇండియాలో అక్కడక్కడ పూర్తి అమెరికా నాగరకతతో విలసిల్లే భూ భాగాలున్నాయి. అటువంటి ఓ ఉత్తర భూభాగంలో గోపాలరావ్ సైంటిస్టుసిగా ఉన్నాడు.

మణి పుట్టి పెరిగిన ఊర్లో మాత్రం, ఎంత మేనరికమైనా మరీ మొగుడంటే ఇంత అలుసు పనికిరాదని మణిని మందలించే జనాలు బతికుండటంచేత, భర్తని కాస్త మన్నించి మాట్లాడ్తూ ఉంటుంది.

"ఆయనకి మనూరు నచ్చదు నాన్నా ! ఏ అల్లుడికి అత్తారి ఊరు నచ్చుతుంది కనక" అంది మణి, అరుగు మీద కూర్చుని మల్లెపూల దండ గుచ్చుకొంటూ.

"అల్లుడికి పూర్నచ్చ లేదంటే తప్పే టుంది ? మనూళ్లో నచ్చడానికేటుంది ? ఓ

మెడికల్ కాలేజీనా! ఓ ఇంజినీరింగ్ కాలేజీనా! ఇయ్యి ఏయీ లేకుండా మంచి ఓటల్స్, సినిమా అళ్ళు ఎట్టా వస్తయి? అవి లేనూరు నచ్చమంటే ఎట్టా నచ్చుద్దే!'' అన్నాడు సిద్దయ్య. ఆ మాటల్లో నిస్పృహ కంటే ఆ విషయంలో ఏదో చెయ్యాలన్న తపన ఉంది.

''ఊరెల్లా ఉందని నువ్వంటే ఎదుగూ బొదుగూ లేదన్నాను కానీ ఇక్కడ హోటళ్ళూ సినిమా హాళ్ళూ లేవన్నానా? అయినా మా ఊళ్లో లేవని వాటికోసం ఇంతదూరం మేము రాలేదు కదా! నీ కోసం వచ్చాం'' అన్నాడు నొచ్చుకొంటూ గోపన్న.

''నువ్వాటి కోసం రాలేదు లేవోయ్. కాని వచ్చాక అయ్యుండుంటే కాస్త కాలచ్ఛేపంగా ఉండేదన్నాను. అయ్యి ఆటంతటవి ఎక్కడ పడితే అక్కడ మొలుచుకొస్తాయేటి? ఆటికి సరైన కండిసన్నుండాలి. ఆటికోసం తపించే జనం ఉండాలి. అప్పుడయ్యే ఏర్పడ్తాయి'' అన్నాడు సిద్దయ్య.

''బావుంది మావయ్యా! నువ్వు మరీను. వీటికోసం ఊరూరా ఇంజినీరింగ్ కాలేజీలు మెడికల్ కాలేజీలు స్థాపించాలంటావు? ఆంధ్రా గవర్నమెంటు దివాళా తీస్తుంది అల్లాచేస్తే.''

''లేకపోతే మానేసినట్టు, మద్దెలో ఛస్ ఆళ్లనెవళ్లెట్టమన్నారోయ్. జనమే స్థాపించుకొంటారడ్డు తగలకుండా ఉంటే. బోడెమ్మ చేసే సాయం ఏటంటే ఎదుర్రాకుండటమే అని శ్యాతం.''

''జనం పెట్టేవంటే డొనేషన్ కాలేజీలన్నమాట. విద్యనమ్మే కాలేజీలంటే నాకు సదభిప్రాయం లేదు.''

''ఈ రోజుల్లో యిద్య నమ్మని కాలేజీ యాడుంది? ఎంత కమ్మతొందన్న దాంటోనే తేడాలు. డొనేసన్ డొనేసన్ అంటూ ఆట్నే తీసి పారెయ్యకు! నేసన్ అన్నమాట డొ—నేసన్ అన్న మాటలో దాక్కునుంది. దాన్ని డొ—నేసన్ అన్నాదుట. దు-నేసన్ అనాలట. డి ఓ...దు ... అంటే చెయ్యి అని అర్దం. దు — నేసన్ అంటే దేశాన్ని చెయ్యి అని అర్థం. దేశాన్నేటి చెయ్యాలి? బాగుచెయ్యాలి. దేశాన్ని బాగు చెయ్యడం కోసమెట్టిందే డొనేసన్! ఏటా డంగైపోయావా! ఇదంతా మన స్వంతం కాదు. ఆ మద్దె డొనేసన్ల మీద దుమారం లేస్తే ఓ బాగా సదువు కున్నాయన ఆటిని సమర్దిస్తూ ఈ ముక్కలెప్పాడు. ఆయన ఎటువంటి ఎదవపనినైనా కూడా తన తెలివి తేటల్తో సమర్థించ గలడట'' అన్నాడు సిద్దయ్య పకపకా నవ్వుతూ.

''ఈ ఊళ్లో డొనేషన్ కాలేజీ పెట్టడాని కెవరైనా ముందుకొస్తున్నారా?'' అని అడిగాడు గోపాలావు.

''మన కులపోళ్ల కింకా ఓ కాలేజీ అంటూ ఏర్పడలేదు కదా! అందుకని మనోళ్లే ఎడ్దారి అనుకొంటున్నారు''

''డొనేషన్ కాలేజీలు అవటమే కాకుండా కులాని క్కోటా! కులాల మీద ఆధారపడి కాలేజీలు పెట్టడం అసహ్యం కదూ!'' అన్నాడు గోపాలావు. నలుపు తెలుపు అన్న కులాలున్నందుకు అమెరికాలో ఎంత గొడవ జరుగుతున్నది! రంగును బట్టి కులాలుగా ఏర్పడటాన్ని భారతదేశం ఎన్ని చోట్ల ఎంత తీవ్రంగా నిరసిస్తోంది! అటువంటిది భారతదేశంలోనా ఈ అపదిష్ట పన్జరగటం!

''ఏటా ఆ ఎర్రి కుట్టి మాటలు. పెతివానికి కులాలకి సంబందం ఉంది. పెబుత్వాలు కులాల బలంమీద నిలబడ్తాయి. కులాల సపోర్టు లేక కూలిపోతాయి. పదవుల పంపిణి జరిగేది కులాల వారీగానే కదా! ఆఖరికి రాజ్యాంగంలో కూడా స్పెసల్గా కులాల గురించి ఓ ముక్క చెప్పారు. ఆ కులాల్నే ఎస్సీలన్నారుట. అద్జూసి మా మాలేటి అంటూ బేరాలెట్టిన కులాల్ని బిసిలన్నారుట. ఈ ముక్క తెలివైన ప్రొపెసరే చెప్పాడు. అందుకేత మనదేశం చల్లగా ఉండాలంటే కులాల ఊస్తప్పదురా గోపన్నా!''

''బావుంది''

''ఒప్పుకొన్నావు కదా! రేపు మన సుబ్బయ్య కార్లో బయల్దేరి దగ్గర్లో ఉన్న తాటిపాకారి ఇంజినీరింగ్ కాలేజీ ఎట్టా ఉందో దాని యవారం ఏటో చూసొద్దాం. దానివల్ల మనక్కొంచెం అయిడియా ఉంటది. నువ్వు చదువుకున్నోడివి కదా మాతోరా మాట సాయంగుంటది.''

''సరే కానీ''

''నాన్నా! నేనూ వస్తాన్నాన్నా! కార్లో చోటుంటుందా?'' అని ముద్దుగా అడిగింది సిద్దయ్యని కూతురు మణి.

''రా తల్లీ! నీకు లేకపోతే ఎవరికీ ఉండదు'' అన్నాడు సిద్దయ్య.

అతనికి కూతురు కోసం ఎంత త్యాగమన్నా చేస్తాడు! ఎంత అఘాయిత్యప్పనైనా నిశ్చింతగా చేస్తాడు.

మర్నాడు సుబ్బయ్య ఎంబాసిడర్ కార్తీసుకొనివచ్చి వీధిలో నిలబెట్టాడు. డ్రైవర్ పక్కన గోపాలావ్, అతన్ని ఆనుకొని మణి కూర్చున్నారు. వెనకసీట్లో ఘనకాయులైన సిద్దయ్య, సుబ్బయ్య సర్దుక్కూర్చున్నారు కారు ఇంజినీరింగ్ కాలేజీ దిశలో కదిలింది.

''మన మంత్రి గారికింకా రెండేళ్లే గడువుంది, ఆయనన్నట్టు ఇరవైమైళ్లకో ఇంజినీరింగ్ కాలేజీ స్థాపించడానికి ఆ తరువాత ఎన్నికలు, కీడెంచిమేలెంచమన్నారు'' అన్నాడు సుబ్బయ్య.

''మరే ఈ కాలేజీకి మన వూరికి ఇరవై మైళ్ళ దూరం, మనూళ్లో కాలేజీ ఎడ్తే ఎర్రాయన సంతోసిస్తాడు'' అన్నాడు సిద్దయ్య.

కారు సరిగ్గా ముప్పైరెండు కిలోమీటర్లు పోగానే, స్పీడా మీటరు రీడింగ్స్ చూస్తూ కూర్చున్న గోపాలావు,

''ఏదీ ఇంజినీరింగ్ కాలేజీ కనపడదేం?'' అన్నాడు ప్రశాంతంగా.

''మరే ఏది?'' అన్నాడు సుబ్బయ్య.

''కారాపి అడుగుదారి'' అన్నాడు సిద్దయ్య.

కారాగింది. దూరంగా కల్లు పాకల లాంటివి కనిపిస్తున్నాయి. ఊరుందని సూచిస్తూ జనం కూడా కనిపిస్తున్నారు. అటుకేసే సైకిల్ మీద, వీళ్ల కారుని దాటుకొని పోబోతున్న కుర్రాడ్ని గోపాలావు చూసి పిలిచి,

''ఎక్స్క్యూజ్మి. ఇక్కడో ఇంజనీరింగ్ కాలేజీ ఉండాలిట?'' అని అడిగాడు.

''తాటిపాక వారి ఇంజినీరింగ్ కాలేజీ యేగా?'' అని అడిగాడు ఆ అబ్బాయి.

''కావచ్చు''


''అక్కడ తాటిపాకలు కనిపించడంలేదూ! అదే కాలేజీ''

''అయ్యా కాలేజీ బిల్డింగులు?''

''అయ్యా! అయ్యే మా బిల్డింగులు. చూడండి ఇప్పుడు తొమ్మిదింపావు అయింది. క్లాసు తొమ్మిదిన్నరకైపోతుంది ఆ లోపల

నేను జేరుకోకపోతే ఏటెండెన్సు పోతుంది, అందుకని తొమ్మిదిన్నర లోపల అక్కడకి చేరుకోవాలి. లేకపోతే మా ప్రిన్సిపాలు తాట వలుస్తాడు...సెలవిప్పించండి'' అని సైకిల్ పెడల్ తొక్కించాడు.

'ఇంజినీరింగ్ కాలేజీ అంటే ఇంద్ర లోకం అంత వైభవంగా ఉంటుందను




## సంచార పరిశోధనాలయం

కొన్నాను'' అన్నాడు సుబ్బయ్య.

''ఏమో ఉందేటో! దగ్గిరగా ఎళ్లి చూద్దారి! డ్రైవర్ అటుకేసి పోనీ'' అన్నాడు సిద్ధయ్య.

మరో కిలోమీటర్ పోయేసరికి తాటిపాక వారి ఇంజినీరింగ్ కాలేజి అని ఓ తాటిమట్ట మీద వ్రాసి ఉంది. ఈ తాటి మట్టని మరో రెండో తాటిమట్టలు మోస్తున్నాయి. మూటిని కలిపి స్వాగత ద్వారంలా ఏర్పరచారు.

అందరు కారు దిగి ప్రిన్సిపాల్ పాకకేసి నడిచారు. ఆయన వీళ్లని సాదరంగా ఆహ్వానించారు. విసురుకోడానికి తాటాకు విసినకర్రలిచ్చాడు. తాగడానికి మంచినీళ్లిస్తూ,

''చుట్టూ ఉన్నవి తాటిచెట్లు ... తాగడానికి పాలిచ్చినా మరోలా భావిస్తారు పుచ్చుకొనేవాళ్లు, చూసే విద్యార్థులు అందరు. అందుకని నీళ్లే ఇస్తున్నాను'' అన్నాడు వినయంగా.

కొద్ది నిముషాల తరువాత వచ్చిన వారివైపు తిరిగి పదండి కాలేజీ చూపిస్తాను.

''ఇది నూరు మంది పట్టే లెక్చర్ హాలు' ''ఇది డ్రాయింగ్ హాలు'' అంటూ ఒకొక్క పాకనే పరిచయం చేసాడు.

ఇంతలో దుమ్ము లేపుకొంటూ ఓ లారీ వచ్చింది. క్లాసుల్లో ఉన్న విద్యార్థుల్ని విడిచిపెట్టారో, వాళ్లే స్వతంత్రం ప్రకటించి బయట పడ్డారో కాని అంతా బిల బిల మంటూ బయట పడ్డారు. లారీ ముందు మూడు క్యూల్లో నిలబడ్డారు. సిద్ధయ్యా వాళ్లదగ్గర ''క్షమించండి మళ్ళీ వస్తా'' అంటూ ప్రిన్సిపాల్ సెలవు తీసుకొని లారీ ఫ్రంట్ సీట్లో కూర్చుని వచ్చిన శాల్తీతో మాట్లాడేందుకు వెళ్లిపోయాడు.

బయట నిలబడ్డ సిద్ధయ్య బృందం బయట జరుగుతున్న కోలాహలానికి శ్రోతలు, కదలికలకి ప్రేక్షకులు అయ్యారు. లారీ మీద ఏవో చిన్న చిన్న బల్లలు, బల్లల మీద ఏవో వస్తువులు ఉన్నాయి. లారీ మీద మొబైల్ అని వ్రాసి ఉన్న అక్షరాలు కన్పిస్తున్నాయి. మిగిలిన అక్షరాలేవో తెలియకుండా వాటిమీద ఆర్టిసిబస్సులు స్ట్రైకని, ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థులేదో ఊళ్లో నిరసన వ్రతం చేస్తున్నారని, మరో ఊరు హాస్పిటల్ డి. ఎమ్. ఓ గారు నరరూప రాక్షసుడుగారని స్లోగన్స్ వ్రాసున్నాయి. తెలుగులో ''లయం'' అన్న అక్షరాలు కనిపించీ కనిపించకుండా ఉన్నాయి.


క్యూల్లో విద్యార్థులు ''అష్టోత్తరం ఒకటి'' ''లోమాల సేవ ఒకటి'' ''కల్యాణం ఒకటి''అని చెప్పి ఏవరిక్కావలసిన టిక్కెట్లు వాళ్ళు కొనుక్కుంటున్నారు.

''ఓహో ఇది సంచార దేవాలయం కాబోలు. చుట్టుపట్ల ఏ గుడి లేకపోతే మేనేజ్‌మెంటు భక్తితో చేసిన ఏర్పాటు అయి ఉంటుంది'' అని ఊహించాడు గోపాలరావు.

ఇంతలో ఒక జీప్ బుర్రమని శబ్దం చేసుకొంటూ వచ్చి ఆగింది. అందులోంచి దిగిన ఆసామిని చూస్తూ ''ఏటి రామకిట్ట రాజుగారిట్టా వచ్చారు!'' అని సిద్ధయ్య పలకరించారు.

''సిద్ధయ్యగారా! ఆయ్ బావున్నారా? కాలేజీ పెడుతున్నారంటగద, మంచి పన్జేస్తున్నారు'' అని రామకృష్ణరాజు కుశల మడిగాడు.

''ఆ ఏదో విద్యున్నాం. ఈ య వ!



సుబ్బయ్యా. మా అమ్మాయి, అల్లుడూ, మీ కాలేజీ ఎట్లా నడుస్తోంది ?'' అని సిద్దయ్య అడిగాడు.

"బాగానే నడుస్తోంది.మాకు ఈ లారీతో పనిబడి ఇల్లా వచ్చాం. ఓయ్ డ్రైవర్ ! మీ ప్రొప్రైటర్ గారేరి ? '' అని అడిగి ఆయన ప్రిన్సిపాల్ ఆఫీసులో ప్రిన్సిపాల్‌తో ఉన్నాడని తెలుసుకొని "పదండి లోపలికెళ్దాం.పరిచయం చేస్తాను మీకు అవుసరం రావచ్చు కాలేజీ పెడ్తున్నారు కదా !'' అన్నాడు సిద్దయ్యతో రామకృష్ణంరాజు.

మణి, గోపాల్రావు బయటే ఉంటా మన్నారు. అరగంట పోయాక సిద్దయ్య సుబ్బయ్య నవ్వుకొంటూ బయటికి వచ్చారు.

"ఇన్ని ఊళ్లుంటే ఊరుకోటేం కర్మ పేటకో ఇంజినీరింగ్ కాలేజీ ఎట్టుకోవచ్చు'' అన్నాడు సిద్దయ్య.

"మరే'' అన్నాడు సుబ్బయ్య.

వాళ్లిద్దరు కారెక్కి కూర్చున్నాక గోపన్న, మణి కూడా ఎక్కారు. కారు తిరుగు ప్రయాణం మొదలు పెట్టింది.

"ఈ సంచార దేవాలయం ప్రతీ కాలేజీకి వెళ్తుందిటా?'' అని అడిగాడు గోపన్న.

"ఇది సంచార దేవాలయం కాదురా గోపన్నా! ఇది సంచార పరిశోధనాలయం'' అన్నాడు సిద్దయ్య.అని డ్రమాటిక్‌గా ఆగాడు. గోపన్న అడగనే అడిగాడు,

"అదేమిటి? దాని కథేమిటి?'' అని.

సిద్దయ్య మణికేసి ఓసారి తేరిపారచూసి కళ్లు మూసుకుని అదేమిటో దాని కథ ఏమిటో చెప్పాడు.

ఊరుకో ఇంజనీరింగ్ కాలేజీ పెట్టడానికి పర్మిషన్ తెచ్చుకోడం కష్టమేమీ కాదు. దానికి సుగమమ్మైన మార్గాలు ఏర్పడ్డాయి. ఎవరెప్పుడు ఎక్కడ ఎలా చూడాలనేది అనుభవం ఉన్నవాళ్ల నెవర్నడిగినా చెప్తారు. పోతే కాలేజీ బిల్డింగ్స్ కట్టుకోడానికి సిమెంటు దొరకదు. స్కిల్డ్ లేబర్, తాపీ మేస్త్రీలు దొరకరు. పాకలైతే విద్యార్థుల చేతో, సీటడగటానికి వచ్చిన తండ్రులచేతో వేయించవచ్చు. గొడ్ల పాకలున్న ఖాళీస్థలా లుంటే స్థలంతోపాటు వాటిని కొనుక్కొని లబ్ధి పొందవచ్చు. కాని లాబొరెటరీలు పెట్టాలంటే కుదరదు. కాలేజీలు కుక్క గొడుగుల్లా మొలుచుకొస్తున్నాయి కదా అని సైంటిఫిక్ ఎక్విప్‌మెంట్ మాన్యు ఫాక్చర్ చేసే కంపెనీలు పోటీపడి అదేరేట్లో పుట్టుకు రావుకదా! ఒకటి క్షుద్ర సంతానం. మరోటి వినుత సంతానం. అందుచేత కొత్త కాలేజీ లిరవై ఉన్నా సప్లై కంపెనీ ఒకటే ఉంది. అందుకని అన్ని కాలేజీలు వాళ్ళక్కావలసిన ఎక్విప్‌మెంట్‌కి ఆ కంపెనీకే ఆర్డరిచ్చారు. ఆ కంపెనీ పెట్టి ఇరవై సంవత్సరాలైంది. ఆ ఇరవై సంవత్సరాల్లో మొత్తం ఎన్ని ఆర్డర్లు వచ్చాయో, ఈ ఒక్క సంవత్సరంలో ఆ కంపెనీకి అన్ని ఆర్డర్లు వచ్చాయి. గురుడు గుక్కతిప్పకోలేకపోయాడు అందరు "మాకు ముందుగా ఇవ్వాలంటే మాకు ముందుగా ఇవ్వాలి'' అన్నారు. ఆ కంపెనీ "మీకు ముందంటే మీకు ముందని'' వాగ్దానాలు చేసింది. రాత్రీ పగలూ పన్జేసి సకాలంలో అయిదు కాలేజీలకి సప్లై చేసింది. ఆరోబాచ్ తయారయ్యేసరికి పరీక్షలు దగ్గర పడ్డాయి. దాన్ని ఏ కాలేజీ కిచ్చినా మిగతా పద్నాలుగు కాలేజీలకి కోపం వస్తుంది. కేసులు పెడ్తారు. యూనివర్సిటీలో దేన్నైనా సపోర్ట్ చెయ్యగల తెలివితేటలున్న ప్రొఫెస రున్నాడని చెప్పుకొన్నాం కదా! అతడిల్లాంటి ప్రాణసంకట పరిస్థితుల్లో తగుమాత్రపు ఫీజుకి తరుణోపాయాలు సూచిస్తాడని తెలిసి ఈ కంపెనీ అతన్ని కలుసుకొంది. అతనిసలహా మేరకు ఈ కంపెనీ ఆరో బాచ్ ఎక్విప్‌మెంటుని ఎవరికి డెలివర్ చెయ్యకుండా దాంతో ఓ సంచార పరిశోధనాలయం ఏర్పాటు చేసాడు.''

"మరి స్టూడెంట్స్ కొనుక్కుంటున్న అష్టోత్తరం, తోమాలసేవ — కల్యాణం టిక్కట్ల మాటేమిటి?'' అని అడిగాడు గోపాల్రావు.

"వస్తున్నాను. తొందరపడమాకు. ఏడాది కోర్సు మూడ్రోజుల్లో పూర్తవ్వాలంటే మాట్లా!''

"మూడు రోజులా?''

"కాక మూడు నెలలా లారీ నీ ఊళ్లో ఉంచేత్తే మిగిలిన కాలేజీలమాటో? అల్లకీయనిచ్చిన మాటో?? మూడంటే మూడే రోజులుంచుతాడట బండినీ ఊళ్లో. మళ్లీ పరీక్షల సమయంలో తెచ్చి కాలేజీలో నిలబెట్టడాని కొప్పందం'' సిద్దయ్య చెప్ప కొచ్చాడు.

విద్యార్థులకి మూడు ఆప్షన్స్ ఇచ్చారు. ఒకటి: చెయ్యాల్సిన ఎనిమిది ప్రయోగాలకి ప్రశ్నోత్తరాలలాగా తయారుచేసిన సైక్లో స్టైల్డ్ నోట్సు కొనుక్కోడం ఒకటి. దాన్ని అష్టోత్తరం అంటారు. ఆ నోట్సు దగ్గర పెట్టుకొని తోమాలసేవ టిక్కెట్లు కొనుక్కున్న విద్యార్థులు ప్రయోగం చేస్తుండగా పక్కన నిలబడి "అదిగో బొమ్మలో చూపించిన ఎనిమిదో నంబర్ నాబ్. దాన్ని కుడివైపుకి తిప్పి ఎడంకన్నుతో ఆ లెన్సులోంచిచూడాలి'' అని చెప్పుకొంటూ వాచ్ చేస్తారు ఈ టిక్కెట్టు కొనుక్కున్న వాళ్ళు దీని ధర తక్కువ

రెండు: ప్రతీ ఎక్స్‌పరిమెంటు స్వంత చేత్తో చేసుకొని చూసుకొనే ఆప్షన్- దీని ధర ముందు దానికంటే హెచ్చు అయితే ప్రయోగం అయ్యాక ఎవరి పరికరాలు వాళ్ళే తోమి శుభ్రపరచి పోవాలి. ఆ ప్రొప్రైటర్ "మీరా యాపరేటస్ మర్చిపోకుండాతోమాల'' అని చెప్తాడని దీనికి తోమాలసేవన్న పేరు పెట్టారు.

మూడు : అన్నింటిలోకి ఉత్తమమ్మైన ఆప్షన్ కల్యాణం ఇది విద్యార్థుల కళ్యాణం నిమిత్తం ఏర్పాటైంది. ఈ టిక్కెట్టు కొన్న వాళ్ళకి కంపెనీ యే ఎక్స్‌పరిమెంట్లు ఎలా చెయ్యాలో చేసి చూపిస్తుంది వ్రాసిన రికార్డులను రెడీమేడ్‌గా ఇస్తారు. కాండిడేటు దానిమీద తన పేరు వ్రాస్తే చాలు. పరీక్షల్లో ఎగ్జామినర్ తల దిప్పినప్పుడు రీడింగ్స్ తీసి పెడ్తారు. కాల్క్యులేషన్స్ చేసి పెడ్తారు. కాండిడేటు పేపరుమీద తనకి తోచింది వ్రాస్తే చాలు. అది కంపెనీవాళ్లు కొట్టేసి సరైన జవాబులు వ్రాస్తారు. అయితే కాండిడేటు మాత్రం పేపరుమీద కరెక్టుగా నంబరు వేయాలి! అది చేస్తే ఇంక కల్యాణం టిక్కెట్టు కొన్న విద్యార్థి పాస్ అవడం గారంటీ. అతనికి పద్ధతి కల్యాణప్రదం.

"అదిరా. ఆ సంచార పరిసోదనాలయం కత'' అని సిద్దయ్య ముగించేసరికి కారు వాళ్ళ ఊరు జేరింది.

గోపన్న "ఇల్లా చదువుకొని పాసైన వాళ్ళే ప్రభుత్వపు లాబ్స్‌లో చేరి ఏదన్నా చెయ్యాలంటే భయపడా కూర్చుంటారు. వీళ్ళమీద ఆశపెట్టుకొని అశేష ప్రజానీకం మంచి రోజులు వస్తాయని నమ్ముతూ ఉంటుంది'' అనుకొన్నాడు భారంగా.

మణి గోపీకేసి 'బాధపడకు' అన్నట్టు చూసింది.